కథ



# అమ్మ రుణం

■ ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఇమ్లిబన్ బస్ స్టేషన్ నుంచి విజయవాడకు బయలుదేరిన బస్సు వేగాన్ని పుంజుకుంది. ఇంకొద్ది గంటల్లో అమ్మను చూడబోతున్నాను.

అమ్మ అంటే కన్న తల్లి కాదు. పెంచిన తల్లి. నాకు కన్న తల్లి కన్నా ఎక్కువ. ఆ అమ్మ కాని అమ్మ పేరు గోపమ్మ.

ఆవిణ్ణి తలచుకోగానే మనసులో అదో లాంటి మధురభావన కలిగింది. ఇప్పుడే కాదు, ఆవిడ ఎప్పుడు మనసులో మెదిలినా అంతే. ఇప్పుడూ ఆవిడకు సంబంధించిన ఆలోచనలు మెదడులో సుళ్ళు తిరుగుతున్నాయి.

మా అమ్మానాన్నలిద్దరూ ఉద్యోగస్తులే. ఇద్దరు ఎప్పుడూ బిజీనే. ఇద్దరిదీ టార్గెట్ ఓరియంటెడ్ థాట్సే.

ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, స్టేటస్ ఇవి తప్ప మానవ సంబంధాలు వాళ్ళకి నచ్చవు. జీవితాలను అంకెలతో ముడిపెట్టుకుని మనుష్యులవడిపోవడమే ఎంతసేపూ. అలాంటి వాళ్ళకు నేను పుట్టాను, అవరోధంగా... నన్ను పెంచడానికి మా అమ్మ నాయనమ్మకిష్టంలేదు. ఎందుకంటే అమ్మ చిన్నప్పుడే అమ్మమ్మ చనిపోయిందట. పోని బామ్మ కిద్దామంటే ఆవిడ మంచానపడింది. ఆవిడకే తాతయ్య సేవలు చేస్తున్నాడు. మరి నన్ను పెంచేదెవరు?

అమ్మానాన్నలు కొన్నాళ్ళు తర్జనభర్జనలు పడి చివరకు నా ఆలనాపాలన చూడడానికి ఓ కేర్‌టేకర్ను కుదిర్చి నన్నప్పగించాలనుకున్నారు. నన్ను చూసుకోవడానికి ఒక మంచావిడ కావాలని నలుగురికీ చెప్పారు. అప్పుడు నాన్నగారి కొలీగ్ శేషగిరిరావు గోపమ్మ గురించి చెప్పాడు.

గోపమ్మది బతికి చితికిన కుటుంబం. దానికి కారణం వాళ్ళాయన తాగుడే. తను నాలుగిళ్ళల్లో పనిచేస్తూ ఉన్న ఒక్కగానొక్క కొడుకుని గవర్నమెంట్ బడిలో చదివిస్తూ సంసారాన్ని గుట్టుగా లాక్కొస్తోంది. మా అమ్మానాన్నలు నా విషయంలో చేసిన ఒక

మంచి పని ఏమిటంటే పసిపిల్లాడినైన నేను తమ ఉద్యోగ బాధ్యతలకు అడ్డు రాకూడదు కాబట్టి, గోపమ్మని ఆ పదిమందిళ్ళల్లో పని మానేసి నన్ను జాగ్రత్తగా చూసుకోమని జీతం బాగా ఇచ్చి కుదిర్చారు. అదిగో అప్పటినుంచీ గోపమ్మ నాకు అమ్మయింది. నా చిట్టి కళ్లకి గోపమ్మదే అమ్మరూపం. నా చిన్ని కాళ్లూ చేతులకి గోపమ్మ స్పర్శే వెచ్చని అనుభూతి. నేను గుక్కపట్టి ఏడుస్తుంటే ఆవిడ అతలా కుతలం అయిపోయి కళ్ళ నీళ్లు పెట్టుకునేది. నా కేరింతలకు సంతోష తరంగాల్లో ఓల లాడేది. లాలపోసేది. కడుపునిండా పాలు పట్టేది. జోలపాడి నిద్రబుచ్చేది. నేను పాకితే అందరితో ఆ ఉత్సాహాన్ని పంచుకునేది. నేను నిలబడ్డానికి, నడవడానికి ప్రయత్నిస్తే పడి పోతుంటే నేనున్నానని కళ్లతో ధైర్యం చెప్పి నా కాళ్లపై నన్ను నిలబెట్టేది. ఇలా ఒకటేమిటి? నా ఎదుగుదలలోని ప్రతి పార్శ్వంలోనూ అమ్మ గోపమ్మ నిబిడీకృతమైంది.

అయితే ఏపుగా పెరుగుతున్న మొక్కలా నా మీద అమ్మానాన్నలకి అమాంతం ప్రేమ పుట్టుకొచ్చింది. ఎందుకనుకున్నారు? నేను పెద్ద బడిలో పేద్దపేద్ద చదువులు మంచి మార్కులతో చదువుతుంటే అది గొప్పగా, గర్వంగా అందరికీ చెప్పుకుంటూ తమ స్టేటస్‌ను ప్రదర్శించాలని. చదువుపేరుతో నేను నలిగిపోవడంచూస్తూ చీర చెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకునేది గోపమ్మ. పదో తరగతి వరకూ గోపమ్మ సంరక్షణలో చక్కగా పెరిగాను. అప్పుడే ఒక ఊహించని సంఘటన జరిగింది. మా నాన్నని హైద్రాబాదులోని కార్పొరేట్ ఆఫీసుకి మంచి హైక్‌తో బదిలీ చేశారు. అమ్మ హైద్రాబాదుకి పెట్టుకున్న ట్రాన్స్ఫర్ రిక్వెస్ట్‌ని వాళ్ళ ఆఫీసు వాళ్ళూ యాక్సెప్ట్ చేశారు.

ఆ రోజు హైద్రాబాద్‌కి కారులో బయల్దేరి వెళుతూ నేను దూరమవుతుంటే, దూడ దూరమవుతుంటే ఆవు పడే మనోవేదన గోపమ్మ మనసులో స్పష్టంగా గోచరించింది. కానీ నేనేం చేయగలను? మళ్లీ ఏదో రోజు గోపమ్మని చూడడానికి తప్పక రావాలని మనసులో స్థిరంగా అనుకున్నాను.

❋ ❋ ❋

అందుకే ఈ ప్రయాణం.

రెండేళ్ళక్రితం నాన్న హార్ట్‌అటాక్‌తో చనిపోయారు. ఆయన చనిపోయిన ఆర్నెల్లకి అమ్మ డాక్టర్లకి అంతుబట్టని రోగంతో ఈ లోకం నుండి నిష్క్రమించింది. మంచాన వుండగా తను నా పెంపకంలో ఎలా నిర్లక్ష్యం వహించింది, గోపమ్మ నన్ను ఎంత అపురూపంగా చూసుకుందీ వివరంగా చెప్పింది అమ్మ. ఊహ తెలిశాక గోపమ్మ మాతృత్వప్రేమ నేను అనుభూతించిందే! నేనిప్పుడు ఉద్యోగంలో మంచి స్థాయిలో ఉన్నాను. మూడేళ్లక్రితం పెళ్లయింది ఒకపాప.

ఇప్పుడు నాకంటూ మిగిలిన ఒకే ఒక ఆత్మీయ స్పర్శ గోపమ్మ. ఆవిణ్ణి చూడాలని మనసు తహతహలాడుతోంది. నోరారా అమ్మా అని పిలవాలనిపిస్తోంది.

విజయవాడలో దిగి మేము గతంలో ఉన్న చోటికెళ్లి వాకబు చేస్తే సులభంగానే దొరికింది గోపమ్మ ఇల్లు. నేను వెళ్లేసరికి తలుపు తెరిచే ఉంది. గుమ్మం ముందు నుంచుంటే లోపలున్న రెండు గదులూ ఒక వంటిల్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిన్నగా తలుపుతట్టాను. గోపమ్మ కోడలనుకుంటా వచ్చింది. నేను క్లుప్తంగా నా గురించి, గోపమ్మకీ నాకూ ఉన్న అనుబంధం గురించీ చెప్పాను. గోపమ్మని చూడటానికి వచ్చానన్నాను. ఆమె ముఖంలో సంభ్రమాశ్చర్యాలు.

అవును మరి పని చేయించుకుని మర్చిపోయేవాళ్ళనే అప్పటిదాకా చూసుంటుంది. పైగా నాలాంటి ఉన్నత స్థాయి వ్యక్తి ఎప్పటి అనుబంధాన్నో గుర్తు చేసుకుంటూ గోపమ్మని వెతుక్కుంటూ రావడం ఖచ్చితంగా ఆమెకి ఆశ్చర్యం కలిగించేదే! లోపలకు రమ్మన్నట్టుగా పక్కకి తప్పుకుని గోపమ్మ ఉన్న గదిలోకి తీసుకెళ్లింది.

నవారు కుక్కి మంచం మీద గోపమ్మ బక్కచిక్కిన శరీరం కనిపించింది. నన్ను పెంచి పెద్దచేసిన గోపమ్మ ఆ స్థితిలో.. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నేను అక్కడే ఉన్న ప్లాస్టిక్ స్టూల్‌ను గోపమ్మకి దగ్గరగా లాక్కుని కూర్చుని ఆవిడ చేతులు నా చేతుల్లోకి తీసుకొని మృదువుగా నొక్కాను.

గోపమ్మ కళ్లు తెరిచింది. నేను ఎవరో చెప్పాను. ఆవిడ కళ్లలో ఆనందం. ఆ సంతోషం ఆవిడ శరీరాన్ని ప్రకంపింపజేస్తోంది. దేవుడున్నాడు. గోపమ్మ నా మాటలు వినగలిగింది. తన నిస్తేజమైన కళ్ళతో నన్ను చూసి గుర్తు పట్టింది.

‘బాబూ, నాకోసం... నన్ను చూడ్డం కోసం వచ్చావా? అందుకే అంటారయ్యా పెంచిన ప్రేమ గొప్పదని. నువ్వు దూరమైనప్పటి నుండీ నా మనసులోంచి ఒక ముక్క దూరమైనట్టు కలుక్కుమంటా ఒకటే బాధ. నిన్ను చూడాలని ఎంతగానో అనిపించేది. కానీ ఏం చేయ గలను? నేను చనిపోయేలోగా నిన్ను కళ్లారా చూడాలని అనుకునేదాన్ని. ఆ సీతారాముడు నా మొర ఆలకించాడు. నిన్నిక్కడికట్టుకొచ్చాడు అంది కన్నీళ్ళు కళ్ళ నుండి బుగ్గల మీదుగా స్రవిస్తుండగా..

గోపమ్మ కోడలు కబురంపించిందనుకుంటా, వాళ్ళబ్బాయి ఆదరాబాదరగా వచ్చాడు. నమస్కారమండీ, మా అమ్మెప్పుడూ మీ గురించి చెబుతూనే ఉండేది. నీకో తమ్ముడున్నాడ్రా అని. అమ్మ ఇలా వుందని బాధపడకండి. నా స్థాయికి అమ్మను ఇంతకన్నా చూసుకోలేను. అన్నాడు బాధగా.

అదేం లేదు. ఇన్నాళ్లకి చూశాను కదా, మనసు కరిగి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. మా అమ్మానాన్నలిద్దరూ చనిపోయారు. కనిపెంచిన వాళ్ల రుణం తీర్చుకోవాలని శాస్త్రం చెబుతుంది. కన్నవాళ్ళ రుణం తీర్చుకున్నాను. ఇహ ఈ పెంచినమ్మ రుణమే తీర్చుకోవాల్సివుంది. నువ్వు అనుమతిస్తే. అమ్మను నాతో తీసుకుని వెళతాను. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను అన్నాను. అతని కళ్లు సజలాలయ్యాయి. పాపం అతని స్థాయికి తల్లిని జాగ్రత్తగా చూసుకోలేడు. మరో ఆలోచనలేకుండా అంగీకార సూచకంగా తల ఊపాడు. చరమాంకంలో నా దగ్గరైనా సుఖపడుతుందని.

నేను క్యాబ్‌ని పిలిచి అమ్మను అందులో అపురూపంగా కూర్చోబెట్టి హైద్రాబాదుకు బయల్దేరాం.

ఇన్నాళ్లూ నా మనసులో ‘ఇదీ అని చెప్పలేని లోటు మనసుని మెలిపెట్టేది. ఇప్పుడెందుకో అది మాయమయ్యింది.

నాకెందుకో హాయిగా ప్రశాంతంగా ఉంది. నిద్దరోతున్న అమ్మ తలని నా ఒడిలో పెట్టుకున్నాను.

‘దేవుడు పొరబాట్లు చేస్తాడు.. మళ్లీ సరి దిద్దుకుంటాడు అనిపించింది ఆ క్షణంలో.’ ■